క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

గరుగుబిల్లి: మండల కేంద్రంలో పార్వతీపురం 33 కేవీ లైన్ పరిధిలోని ప్రాంతాలకు శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతున్నట్లు విద్యుత్ శాఖ ఏఈ బి.శ్రీనివాసనాయుడు ఓ ప్రకటనలో గురువారం తెలిపారు. విద్యుత్ వైర్లను తాకే చెట్లకొమ్మలు తొలగింపు నేపథ్యంలో నర్సిపురం, మేరంగి, నాగూరు సబ్‌స్టేషన్‌ల పరిధిలోని గ్రామాలకు విద్యుత్ నిలిపివేయడం జరుగుతుందన్నారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు ఈ అసౌకర్యం కలుగుతుందని, వినియోగదారులు గమనించి, సహకరించాలని కోరారు.

గుమ్మలక్ష్మీపురం(కురుపాం): పార్వతీపురం 132, 133 కేవీ సబ్‌స్టేషన్లలో విద్యుత్ నిర్వహణ పనుల నేపథ్యంలో జియ్యమ్మవలస, కురుపాం, గుమ్మలక్ష్మీపురం మండలాల్లోని పలు ప్రాంతాలకు శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు కురుపాం ఏఈ గోపాల్ ఓ ప్రకటనలో గురువారం తెలిపారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఈ అసౌకర్యం ఉంటుందని, వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

కొమరాడ: మండలంలోని పలు గ్రామాలకు శుక్రవారం విద్యుత్ సరఫరా అంతరాయం ఉంటుందని ఆ శాఖ ఏఈ జి.వెంకటరమణ గురువారం తెలిపారు. విద్యుత్ వైర్లను తాకే చెట్లను తొలగిస్తున్న నేపథ్యంలో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు కరెంట్ సరఫరా నిలిపివేస్తున్నామని పేర్కొన్నారు. వినియోగదారులు గమనించి, సహకరించాలని కోరారు.

అమ్మవార్ల విగ్రహ ప్రతిష్ఠ



అమ్మవార్ల విగ్రహ ప్రతిష్ఠ చేస్తున్న అర్చకులు

సీతంపేట: స్థానిక సంతోషిమాత ఆలయంలో అమ్మవార్ల విగ్రహాలు గురువారం ప్రతిష్ఠ చేశారు. ఆలయ అర్చకులు వేమకోటి సాయికృష్ణ శర్మ ఆధ్వర్యంలో లక్ష్మీగణపతి, మహాలక్ష్మి, మహాసరస్వతి అమ్మవార్ల విగ్రహాలు ప్రతిష్ఠ చేసి ప్రత్యేక పూజలు చేశారు. దేవతా విగ్రహాలకు అధివాసములు, అగ్నిప్రతిష్ఠ హోమాలు, అష్టదిగ్బలి, స్వస్తి కార్యక్రమాలు నిర్వహించారు.

వండువలో నేత్ర శిబిరం



నేత్ర పరీక్షలు చేస్తున్న వైద్యుడు

వీరఘట్టం: మండలంలోని వండువ షిర్డీ సాయిబాబా ధ్యాన మందిరంలో గురువారం నిర్వహించిన నేత్ర శిబిరంలో 78 మందికి పరీక్షలు చేశారు. జిల్లా అంధత్వ నివారణ శాఖ ఆధ్వర్యంలో విశాఖపట్నం శంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రి సౌజన్యంతో నిర్వహించిన శిబిరంలో 56 మందిని శస్త్ర చికిత్సలకు ఎంపిక చేసినట్టు ఆలయ ధర్మకర్త మజ్జి సింహాచలం తెలిపారు.

విద్యార్థి మిత్ర కిట్లు పంపిణీ

భామిని: మండలంలోని ప్రభుత్వ పాఠశాలలకు ఎంఈవోలు వి.భాస్కరరావు, ఎ.శ్రీనివాస్ ఆధ్వర్యంలో సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్ర కిట్లు గురువారం పంపిణీ చేశారు. భామిని ఏపీ మోడల్ స్కూల్‌లోని విద్యార్థి మిత్రల కేంద్రం నుంచి ప్రత్యేక వాహనాల్లో పాఠశాలలకు పంపారు. విద్యార్థులకు అవసరమైన స్కూల్ బ్యాగులు, పాఠ్య పుస్తకాలు, బెల్టులు, నోటు పుస్తకాలు, డిక్షనరీలు పంపిణీ చేశారు. యూనిఫాంలు ఇంకా రావాల్సి ఉందని ఎంఈవోలు తెలిపారు. సీఆర్‌టీఎంటీపీస్‌లు ఎస్.చిన్నబాబు, టింగ ప్రసాద్, పి.కిశోర్, ఐఈఆర్‌టీలు సురేష్, వెంకటరావు, సిబ్బంది ఉన్నారు.

ప్రతిభా అవార్డులకు ఎంపిక

పాలకొండ రూరల్: ఇటీవల విడుదలైన ఇంటర్ ఫలితాల్లో అత్యుత్తమ ప్రతిభ కనపర్చిన తమ్మినాయుడు విద్యా సంస్థలకు చెందిన విద్యార్థులను యాజమాన్యం అభినందించింది. తమ కళాశాలకు చెందిన కోనాడ ప్రహర్షిణి(బైపీసీ-985), అనాధుల సాహితి సిరి(బైపీసీ-982)తో పాటు హెచ్ఈసీ విభాగంలో 869 మార్కులు సాధించిన కలివరపు స్రవంతి రాష్ట్ర ప్రభుత్వంచే గుర్తింపు పొందిన షైనింగ్ స్టార్స్ ప్రతిభా అవార్డులకు ఎంపికయ్యారని తెలిపారు. సదరు విద్యార్థులు ఈ నెల 9న వారి తల్లితండ్రులతో కలసి జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా ఈ అవార్డులు పొందనున్నట్టు విద్యాసంస్థల అధ్యక్షురాలు శెట్టి నారాయణమ్మ, ప్రిన్సిపాల్ ఎ.తిరుపతిరావు, అనీల్ కుమార్ తెలిపారు.

దరఖాస్తుల ఆహ్వానం

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని భద్రగిరి ప్రభుత్వ ఆర్‌ఐటీఐలో ఫిట్టర్ ట్రేడ్ తరగతుల బోధనకు అర్హులైన వారి నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ సీహెచ్ సునీల్‌కుమార్ ఓ ప్రకటనలో గురువారం తెలిపారు. డిప్లమోలో మెకానిక్ ఇంజినీరింగ్ చదివి, వెల్డింగ్ పనిలో అనుభవం ఉన్నవారు ఈ పోస్టుకు అర్హులన్నారు. ఎంపికైన వారికి నెలకు రూ.11,500 వేతనం అందివ్వడం జరుగుతుందని, ఈ వేతనం ఏటా పెరిగే అవకాశం ఉందన్నారు. ఆసక్తి ఉన్న వారు ఐటీఐ నందు బయోడేటాతో సంప్రదించాలని కోరారు.

ఇళ్ల ప్లాన్ అనుమతుల్లో

సుడా సిత్రాలు



శ్రీకాకుళం పట్టణాభివృద్ధి సంస్థ కార్యాలయం(సుడా)

- చిన్న చిన్న లోటుపాట్లను తమకు అనుకూలంగా మార్చుకుంటున్న ప్రైవేట్ ఏజెన్సీలు
- ఇంటి ప్లాన్ కోసం ఇష్టానుసారంగా డబ్బులు వసూలు చేస్తున్న వైనం

వీరఘట్టం: ప్రతి ఒక్కరూ తమకు సొంత ఇల్లు ఉండాలనుకుంటారు. సొంతింటి నిర్మాణం కోసం సామాన్య, మధ్య తరగతి ప్రజలు నానా తంటాలు పడుతూ ఇళ్ల నిర్మాణాలు చేపడుతున్నారు. ఎంతో కష్టపడి ఇళ్ల నిర్మాణాలు చేపడుతున్న వీరికి ఇంటి నిర్మాణానికి కావాల్సిన ప్లాన్ అప్రూవల్ కోసం నానా అవస్థలు పడాల్సి వస్తోంది. ఒకప్పుడు గ్రామాల్లో నిర్మించే ఇళ్లకు పంచాయతీ అనుమతి తీసుకుండేవాళ్లు... ఇప్పుడు కొత్తగా వీరఘట్టం మండలం శ్రీకాకుళం అర్బన్ డవలప్‌మెంట్ అథారిటీ (సుడా) పరిధిలోకి వచ్చింది. దీంతో ఇళ్ల నిర్మాణాలు చేపట్టేవారు ముందుగా సుడా అనుమతులు తీసుకోవాలని అధికారులు చెబుతున్నారు. అయితే నేరుగా సుడా అధికారులు ఈ అనుమతులు ఇవ్వడం లేదు. ఇళ్ల నిర్మాణాల అనుమతుల ప్రక్రియను థర్డ్ పార్టీ వారికి (ప్రైవేటు ఏజెన్సీలకు) అప్పగించారు. దీంతో ఈ ప్రైవేటు ఏజెన్సీలు వారు తాము చెప్పిందే వేదం, మేము అడిగినంత సర్వీసు చార్జీలు ఇవ్వాల్సిందేనని లబ్ధిదారుల జేబులకు చిల్లులు పెడుతున్నారు. సుడా నిబంధనల ప్రకారం ఇళ్ల నిర్మాణాలు చేపట్టాలంటే గ్రామీణ ప్రాంతాల్లో సాధ్యం కాదు. ఎందుకంటే ఇక్కడ పక్క పక్కనే ఇళ్ల నిర్మాణాలు జరుగుతుంటాయి. ఇక్కడ ఉన్న చిన్న చిన్న లోటుపాట్లును ఈ ప్రైవేటు ఏజెన్సీలు సొమ్ము చేసుకుంటూ అడ్డుగోలుగా లబ్ధిదారులను దోచుకుంటున్నారు.

సర్వీసు చార్జీల పేరిట నిలువుదోపిడీ

సుడా పరిధిలో ఉన్న ప్రైవేటు ఏజెన్సీలు ఇంటి నిర్మాణ అనుమతుల పేరిట సర్వీసు చార్జీలను తమ నుంచి నిలువుదోపిడీ చేస్తున్నారని లబ్ధిదారులు పేర్కొంటున్నారు. ఇటీవల వీరఘట్టం, నడుకూరు ప్రాంతాల్లో ఇళ్ల నిర్మాణాలకు పలువురు లబ్ధిదారులు సుడా అనుమతుల కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఇందులో 1శాతం లేబర్ సెస్ చార్జీలు, పంచాయతీ సెస్ చార్జీలు(ప్రాంతాల వారీగా ఈ చార్జీలు మారుతాయి)తో పాటు 14 శాతం వ్యవసాయ భూములు, లే-ఔట్ భూములపై నిబంధనల ప్రకారం చలానాలు తీయిస్తున్నారు. ఇందులో సర్వీసు చార్జీల పేరిట అంతకు మించి వీరు వసూళ్లు చేయడంపై లబ్ధిదారులు మండిపడుతున్నారు. ఈ విషయాన్ని బయటపెడితే తమ ఇళ్ల నిర్మాణాల అనుమతులు రద్దు చేసేస్తారేమో అని భయంతో వారు అడిగినంత ఇచ్చేసి లబోదిబోమంటున్నారు. ప్రైవేటు ఏజెన్సీల వసూళ్లకు సుడా అధికారులు క్లెం వేయాలని లబ్ధిదారులు కోరుతున్నారు.

ఇవీ నిబంధనలు...

గ్రామ పంచాయతీ పరిధిలో నిర్మించే నివాస గృహాలు 300 చదరపు మీటర్లు లోపు నిర్మిస్తే అటువంటి గృహాలకు సుడా అనుమతి అక్కర్లేదు. గ్రామ పంచాయతీ అనుమతి తీసుకుంటే సరిపోతుందని నిబంధనలు చెబుతున్నాయి. వ్యాపార భవనాలు, సముదాయాలు నిర్మిస్తే మాత్రం సుడా అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలి. అయితే సుడా పరిధిలో పనిచేస్తున్న ప్రైవేటు ఏజెన్సీలు గృహ నిర్మాణాలను, వ్యాపార సముదాయాలను అందరినీ ఒకే పరిగణనలోకి తీసుకుని వారితో అనవసరమైన ఖర్చులు పెట్టించి అడ్డుగోలు దోపిడీ చేస్తున్నారని లబ్ధిదారులు మండిపడుతున్నారు. సుడా అనుమతుల కోసం ఎక్కడా కచ్చితమైన నిబంధనలు బోర్డులు లేకపోవడంతో ప్రైవేటు ఏజెన్సీలు ఇష్టారాజ్యంగా దోపిడీ చేస్తున్నాయి. ఇప్పటికైనా సుడా అధికారులు స్పందించి అన్ని పంచాయతీ కార్యాలయాల వద్ద సుడా నిబంధనల బోర్డులు పెట్టాలని లబ్ధిదారులు కోరుతున్నారు.

దోపిడీని అడ్డుకుంటాం

ఇళ్ల నిర్మాణాలకు కావాల్సిన సుడా అనుమతుల కోసం ప్రైవేటు ఏజెన్సీలు లబ్ధిదారుల నుంచి అధికంగా డబ్బులు వసూలు చేస్తున్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయి. లబ్ధిదారుల నుంచి అధిక వసూళ్లకు పాల్పడితే వారి లైసెన్సులు రద్దు చేస్తాం. పంచాయతీ పరిధిలో ఇళ్లు కట్టుకునే వారు 300 చదరపు మీటర్లలోపు ఇళ్లు నిర్మిస్తే సుడా అనుమతులు అవసరం లేదు. ఇటువంటి వారు పంచాయతీ అనుమతి తీసుకుంటే సరిపోతుంది. వ్యాపార సముదాయాలు కోసం నిర్మాణాలు చేపట్టేవారు మాత్రం సుడా అనుమతులు తీసుకోవాలి. – కొరికాన రవికుమార్, సుడా చైర్మన్, శ్రీకాకుళం

సోలార్ రూఫ్‌టాప్‌తో విద్యుత్ ఆదా



మండల కేంద్రంలో సోలార్ విద్యుత్ వినియోగంపై అవగాహన కల్పిస్తూ మానవహారం

జియ్యమ్మవలస రూరల్: పీఎం సూర్యఘర్ పథకం ద్వారా అందజేస్తున్న సోలార్ రూఫ్‌టాప్‌తో విద్యుత్ ఆదా చేసుకోవచ్చని మండల విద్యుత్ శాఖ ఏఈ బి.శంకరరావు తెలిపారు. మండల కేంద్రంలో సోలార్ విద్యుత్ వినియోగం ద్వారా కలిగే ప్రయోజనాలపై గురువారం మానవహారం చేపట్టి, అవగాహన కల్పించారు. పీఎం సూర్యఘర్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ పథకం ద్వారా సోలార్ రూఫ్‌టాప్‌ల కోసం తక్కువ వడ్డీకే బ్యాంకుల ద్వారా రుణం అందజేయడం జరుగుతుందన్నారు. ఇంటి అవసరాలకు వాడుకున్న విద్యుత్ మినహాయించి మిగతా విద్యుత్ ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందన్నారు.

వైఎస్సార్ సీపీ బలోపేతానికి కృషి చేయండి



మాజీ డిప్యూటీ సీఎం పుష్పశ్రీవాణి దంపతులను సన్మానిస్తున్న షేక్ నిషార్, సోమయాజులు

గుమ్మలక్ష్మీపురం(కురుపాం)/జియ్యమ్మవలస రూరల్: వైఎస్సార్ సీపీ మరింత బలోపేతానికి కృషి చేయాలని మాజీ డిప్యూటీ సీఎం పాముల పుష్పశ్రీవాణి, పార్టీ జిల్లా అధ్యక్షుడు శత్రుచర్ల పరీక్షిత్‌రాజులు సూచించారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర యూత్ వింగ్ కమిటీ జాయింట్ సెక్రటరీగా కురుపాం ప్రాంతానికి చెందిన షేక్ నిషార్, రాష్ట్ర ఎంప్లాయీస్ అండ్ పెన్షనర్స్ వింగ్ వైస్ ప్రెసిడెంట్‌గా కురుపాం వాసి పీవీఎస్ఎస్ సోమయాజులు నియమితులయ్యారు. వీరిద్దరూ జియ్యమ్మవలస మండలంలోని చినమేరంగిలో మాజీ డిప్యూటీ సీఎం పాముల పుష్పశ్రీవాణి దంపతులను గురువారం కలిసి కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ పదవులు దక్కడంలో వారు చేసిన విశేష కృషిని ప్రశంసిస్తూ సన్మానించారు. అనంతరం వారు కూడా వీరిద్దరినీ అభినందించి, పార్టీ అభివృద్ధికి పాటుపడాలని కోరారు. పార్టీ కోసం పనిచేసిన వారికి ఎప్పుడూ గుర్తింపు ఉంటుందన్నారు. కార్యక్రమంలో కురుపాం ఎంపీపీ శెట్టి పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన అవసరం



ర్యాలీలో పాల్గొన్న అన్నవరం పీహెచ్‌సీ వైద్యులు, సిబ్బంది

పాలకొండ రూరల్: రానున్న వర్షాకాలంలో విజృంభించే వ్యాధులపై అవగాహన పెంచుకోవాలని అన్నవరం పీహెచ్‌సీ వైద్యాధికారి వి.కమల్‌నాథ్ అన్నారు. గురువారం తన సిబ్బందితో కలసి మలేరియా నివారణ మాసోత్సవాల్లో భాగంగా అవగాహనా ర్యాలీ పీహెచ్‌సీ పరిధిలో నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ దోమల కారణంగా మలేరియా వంటి ప్రాణాంతక జ్వరాలు ప్రబలుతాయన్నారు. వీటని అధిగమించేందుకు పరిసరాలు, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. కాచి చల్లార్చిన నీటిని, పౌష్టికాహారం స్వీకరించాలని సూచించారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

మొక్కలతోనే పర్యావరణాన్ని పరిరక్షణ సాధ్యమని పలువురు పేర్కొన్నారు. ఇది అందరి బాధ్యతగా స్వీకరించాలన్నారు. జూన్ 5 ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా పలు చోట్ల ప్రజా ప్రతినిధులు, అధికారులు మొక్కలు నాటారు. ఆయా కార్యక్రమాల్లో అధికారులు, సిబ్బంది, నాయకులు పాల్గొన్నారు.

–పాలకొండ, కురుపాం సాక్షి నెట్‌వర్క్



వీరఘట్టం: మండల పరిషత్ కార్యాలయం వద్ద మొక్కలు నాటుతున్న ఎంపీపీ దమలపాటి వెంకటరమణనాయుడు



భామిని: ఈఎంఆర్ఎస్‌లో మొక్కలు నాటుతున్న ప్రిన్సిపాల్ గంగాదేవి, ఏపీవో బాబూరావు, సర్పంచ్ రాజేష్



గుమ్మలక్ష్మీపురం(కురుపాం): తెన్నుఖర్జలో మొక్కలు నాటుతున్న ఎమ్మెల్యే జగదీశ్వరి



గరుగుబిల్లి: చినగుడబలో మొక్కలు నాటుతున్న మండల ప్రత్యేకాధికారి ప్రభాకరరావు తదితరులు



జియ్యమ్మవలస రూరల్: మండల కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో అధికారులు, తదితరులు

మజ్జిగ పంపిణీ

జియ్యమ్మవలస రూరల్: మండలంలోని బీజేపురం బస్టాండ్ వద్ద యువత మజ్జిగ పంపిణీ గురువారం చేపట్టారు. అహ్మదాబాద్‌లో ఇటీవల జరిగిన ఐపీఎల్ టీ20 ఫైనల్ మ్యాచ్‌లో పంజాబ్ జట్టుపై బెంగళూరు జట్టు గెలుపొందిన నేపథ్యంలో ఈ సేవా కార్యక్రమం నిర్వహించినట్లు యువత పేర్కొన్నారు. కార్యక్రమంలో గుణవర్ధన్, చందు, శివ, సింహాద్రి, ధనుంజయరావు తదితరులు పాల్గొన్నారు.

అన్నదానం

జియ్యమ్మవలస: మండలంలోని వెంకటరాజపురంలో కొత్తగా నిర్మించిన రథాలమ్మ ఆలయ ప్రారంభోత్సవం సందర్భంగా గురువారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఉదయం గణపతి పూజ, పుణ్యాహవచనం, నవగ్రహ మండపం, పూర్ణాహుతి, యంత్ర శిఖర ప్రతిష్ఠాపన, శాంతి కల్యాణం పూజలు జరిగాయి. మధ్యాహ్నం భక్తులకు అన్నప్రసాదం వితరణ చేశారు.

వృద్ధులు, దివ్యాంగులకు ఇంటి వద్దకే రేషన్

జియ్యమ్మవలస రూరల్: వృద్ధులు, దివ్యాంగుల ఇంటి వద్దకే రేషన్ పంపిణీ చేస్తున్నామని, ఆ దిశగా చర్యలు కూడా తీసుకున్నామని తహసీల్దారు ఆర్.పకీరు ఓ ప్రకటనలో గురువారం తెలిపారు. మండలంలో 65 ఏళ్ల వయసు పైబడిన వారు, దివ్యాంగులు కలిపి మొత్తం 2035 మంది ఉన్నారని, వారిలోని 1530 మందికి ఇప్పటికే ఇంటి వద్దకే రేషన్ అందించామన్నారు.

విద్యార్థులకు పోటీ పరీక్షలు

పాలకొండ రూరల్: వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా విద్యార్థులకు గ్రంథాలయంలో గురువారం పలు పోటీ పరీక్షలు నిర్వహించారు. గడిచిన శిక్షణ కాలంలో పిల్లలకు అందించిన తర్ఫీదు, చిత్రలేఖనం, చరిత్ర, సైన్స్ విజ్ఞానం, పుస్తక పఠన ఆవశ్యకతపై ఈ పరీక్షలు నిర్వహించినట్టు గ్రంథాలయ ఇంచార్జ్ బబ్బూరి గణేష్‌బాబు తెలిపారు. శిబిరం ముగింపు రోజున విజేతలకు బహుమతులు అందజేస్తామన్నారు.

దోమల నివారణకు చర్యలు తీసుకోండి



ఆస్పత్రిలో రికార్డులు పరిశీలిస్తున్న జిల్లా మలేరియా నివారణ అధికారి మణి

జియ్యమ్మవలస రూరల్: గ్రామీణ ప్రాంతాల్లో మలేరియా ప్రబలకుండా దోమల నివారణకు చర్యలు తీసుకోవాలని జిల్లా మలేరియా నివారణ అధికారిణి వై.మణి సూచించారు. మండలంలోని అర్నాడ, వనజ, కొత్తగూడ, బిల్లమానుగూడ ప్రాంతాల్లో గురువారం నిర్వహించిన దోమల నివారణ మందు పిచికారీ చర్యలను ఆమె గురువారం పరిశీలించారు. అనంతరం జియ్యమ్మవలస ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి, సిబ్బంది పనితీరు, రికార్డుల నిర్వహణను పరిశీలించి, పలు సూచనలు చేశారు. ప్రజలకు అందుబాటులో ఉండాలని, సీజనల్ వ్యాధుల బారిన ప్రజలు పడకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ఆస్పత్రి వైద్యాధికారి జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

సాగుకు సమాయత్తం కావాలి



సాగు మెలకువలపై అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్తలు

పాలకొండ రూరల్: రైతులు ఖరీఫ్ సాగుకు పక్కా ప్రణాళికతో సిద్ధం కావాలని కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త జి.అమృత అన్నారు. వికసిత్ కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని వెలగవాడ, గోపాలపురం, కొండాపురం గ్రామాల్లో గురువారం అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రకృతి వ్యవసాయం, కృత్రిమ ఎరువుల తయారీ, లోతట్టు, ముంపు భూముల్లో వేయదగిన బరువు రకం వరి వంగడాల ఎంపికపై వివరించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే సేవలు, పథకాల గురించి అవగాహన కల్పించారు. ఐసీఏఆర్ శాస్త్రవేత్త వి.వెంకటేశ్వర్లు తెగుళ్లు, వాటి నివారణ, డ్రోన్ టెక్నాలజీపై వివరించారు. కేవీకే సమన్వయకర్త ఎస్.దూర్వా, శాస్త్రవేత్తలు అను, పూర్ణబిందు ప్రసాద్, చిరు ధాన్యాల్లో యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించారు. ఉద్యానవన, వ్యవసాయాధికారులు అమరేశ్వరి, వాహిని తదితరులు సీజనల్ వ్యవసాయం, తోటల సాగు విధి విధానాలపై రైతుల ప్రశ్నలకు సమాధానాలు అందించారు.

సాంకేతికతతో అధిక దిగుబడులు



రైతులకు అవగాహన కలిగిస్తున్న ఏడీ రత్నకుమారి

పాలకొండ: వ్యవసాయానికి సాంకేతిక జోడించడం ద్వారా అధిక దిగుబడులు సాధ్యమవుతాయని వ్యవసాయ శాఖ ఏడీ రత్నకుమారి అన్నారు. మండలంలోని కొండాపురం గ్రామంలో రైతులకు గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఖరీఫ్‌లో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కేవీకే శాస్త్రవేత్త అమృతకుమారి రైతులకు పంట వివిధ దశల్లో ఎరువుల వినియోగంపై అవగాహన కల్పించారు. భూమి స్వభావం మేరకు పంటలను వేయాలని అన్నారు. కార్యక్రమంలో ఏఈవో పి.నీలిమ, రైతులు పాల్గొన్నారు.

ప్రజలకు మెరుగైన సేవలందించాలి

పాలకొండ రూరల్: గ్రామ స్థాయిలో అధికారులు, వివిధ శాఖలకు సంబంధించిన సిబ్బంది ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని మండల ప్రత్యేకాధికారి, జిల్లా పశు సంవర్ధక శాఖ జేడీ డాక్టర్ శివ్వాల మన్మధరావు అన్నారు. గురువారం పాలకొండ మండలం లుంబూరు గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రం, పాఠశాల, రేషన్ డిపో పరిశీలించారు. అనంతరం గ్రామంలో పారిశుధ్య నిర్వహణ, తాగునీటి వనరుల పనితీరు, సచివాలయ, రైతు సేవా కేంద్రంలో సిబ్బంది సహకారంపై సర్పంచ్ తిర్లంగి ఉపేంద్ర కుమార్‌ను అడిగి తెలుసుకున్నారు. కోనేటి చట్టూ గతంలో వేసిన వివిధ రకాల మొక్కలు, అక్కడి సచివాలయ పరిధిలో చేపడుతున్న అభివృద్ధి పనుల తాజా స్థితిగతులపై ఎంపీడీవో విజయరంగారావు ప్రత్యేకాధికారికి వివరించారు. అనంతరం గ్రామంలో మొక్కలు నాటారు.

సబ్సిడీపై పసుపు విత్తనాలు



ఆదివాసీలకు మొక్కలు అందజేస్తున్న సర్పంచ్ కేశవ, డైరెక్టర్ సంజీవరావు

భామిని: మండలంలోని మనుమకొండలో సర్పంచ్ నిమ్మల కేశవ అధ్యక్షతన వెలుగు అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం జరిగిన సమావేశంలో ఐటీడీఏ పీహెచ్‌వో ఏవీ గణేష్ పసుపు విత్తనాలు పంపిణీ చేశారు. 90 శాతం సబ్సిడీపై గిరిజనులకు వీటిని అందజేశారు. వీడీవీకేల ద్వారా విత్తనాలను పొంది ఆర్థికాభివృద్ధి సాధించాలని ఆయన అన్నారు. అనంతరం ప్రపంచ పర్యావరణ దినోత్సవం ప్రాముఖ్యతను వివరిస్తూ ఆదివాసీలకు పలు రకాల మొక్కలను అసోసియేషన్ డైరెక్టర్ బి.సంజీవరావు, సర్పంచ్ నిమ్మల కేశవ అందించారు. వెలుగు సిబ్బంది శంకర్, మిన్నారావు, నాగేశ్వరరావు, ఏపీసీఎన్ఎఫ్ సిబ్బంది భూషణ్, నరేష్, ఆదివాసీలు పాల్గొన్నారు.

కూరగాయల సాగుపై అవగాహన



పంటల సాగుపై అవగాహన కల్పిస్తున్న జిల్లా వ్యవసాయ సాంకేతికాధికారి హేమసుందర్

గరుగుబిల్లి: మండలంలోని దళాయివలస గ్రామంలో ఏటీఎం మోడల్‌లో కూరగాయల సాగుపై గురువారం అవగాహన కల్పించారు. జిల్లా వ్యవసాయ సాంకేతికాధికారి జి.హేమసుందర్.. ఏయే రకాల కూరగాయల విత్తనాలు వేసుకుంటే నాణ్యమైన పంట, అధిక దిగుబడులు వస్తాయన్న విషయాలను రైతులకు వివరించారు. ఏడాది పొడవునా పంటలు పండించుకునేలా చూడాలని, అప్పుడే ఆదాయం వస్తుందని తెలిపారు. నీటి వసతులు లేనిచోట ఏటీఎం మోడల్‌లో పంటల సాగు సులభమన్నారు. ప్రధాన పంటలు వేసుకునే ముందు పచ్చిరొట్ట విత్తనాలు వేసుకుంటే పంటకు అవసరమైన పోషకాలు పుష్కలంగా అందుతాయన్నారు. కార్యక్రమంలో డీపీఎం పి.షణ్ముఖరాజు, గరుగుబిల్లి, కొమరాడ వ్యవసాయాధికారులు ఆర్.విజయభారతి, శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

ఆధార్ సీడింగ్ కోసం అవస్థలు



కార్యాలయం వద్ద పడిగాపులు కాస్తున్న ప్రజలు

జియ్యమ్మవలస రూరల్: ఆధార్ సీడింగ్ కోసం ప్రజలు అవస్థలు పడుతున్నారు. మండల కేంద్రంలోని రెవెన్యూ కార్యాలయంలో కొత్త ఆధార్‌కార్డులు, బ్యాంకు, రేషన్‌లకు ఆధార్ లింకు కోసం వచ్చే వారంతా రోజంతా పడిగాపులు కాయాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. ఒక్కో వ్యక్తి ఆధార్ పనిని పూర్తి చేసేందుకు ఎక్కువ సమయం పడుతుండడం, ఒక్కోసారి సర్వర్ ఇబ్బంది పెడుతుండడం, మరోసారి సిబ్బంది సమయానికి అందుబాటులో ఉండకపోవడం వంటి కారణాలతో సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన వారి పని ఒక్కరోజులో జరగడం లేదు. ఒక్కొక్కరు రెండు మూడు రోజులు తిరగాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలో వారంతా ఆధార్ నమోదు కార్యక్రమం ఉదయం 8 గంటలకే ప్రారంభమయ్యేలా చూడాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

